# సాధన

రామయ్య చౌదరిగారు నడుస్తూ నడుస్తూ ఎందుకో హఠాత్తుగా ఆగిపోయారు ఆయన అలా నిలబడిపోయారు అయిదారు నిముషాలదాకా.

ఆయన అప్పటికి ఊరు చివరకు వచ్చేశారు. సాయంత్రం అయింది. పశువులు మందలు మందలుగా తిరిగి వస్తున్నాయి పొలం పనులు ముగించుకొని రైతులు, కూలీలు ఇళ్లకు పోతున్నారు. వారిలో కొందరు ఆయనకు నమస్కారంపెట్టి, ఏదైనా పని చెబుతారేమోనని ఒక్క క్షణం ఆగి, నెమ్మదిగా ముందుకు సాగిపోయారు.

ఎవరో ఎట్టఎదుట నిలబడి తన్ను నిలువదీసి అడుగుతున్నట్లే అనిపించింది ఆయనకు.

'నిజం చెప్పు- ఏదో చెప్పి తప్పించుకొని పోవాలని ప్రయత్నం చెయ్యకు. అందువల్ల ఏమీ ప్రయోజనం లేదు.'

ఆయన కొంతసేపు ఎటో చూస్తూ పరధ్యానంగా కన్పించారు.

ఆయన ఆ గ్రామంలో పెద్ద మోతుబరి. ఇరవై ఎకరాల మాగాణి ఉంది. అంతా కవులుకు ఇచ్చారు. కవులుదారులు ఇచ్చింది పుచ్చుకోవడమే కాని, 'ఇదేమిటి ఊళ్ళో అంతా ఎకరానికి పది బస్తాలు ఇస్తుంటే మీరు నాలుగే ఇస్తున్నారేమిటి ; ఎప్పుడో పది సంవత్సరాల క్రితం ఎంత ఇస్తూ వచ్చారో ఇప్పుడూ అంతేనా...' అని ఆయన ఎన్నడూ అడుగలేదు. కాని ఏమీ అడుగకుండానే గడిచిపోయింది.

మరో అయిదు నిముషాలు గడిచాక 'ఏమిటీ ఆలోచిస్తున్నాను?' అని తీవ్రంగా ఆలోచించడం మొదలుపెట్టారాయన. అప్పుడు జ్ఞాపకం వచ్చింది తాను అక్కడ చింతచెట్టు దగ్గర హఠాత్తుగా ఎందుకు ఆగిందీ, తాను ఏమి ఆలోచిస్తున్నదీ.

చౌదరిగారు మళ్ళీ తన్నుతాను ప్రశ్నించుకొన్నారు.

ఆ ప్రశ్న ఆయన చాలా ఆలస్యంగా వేసుకొన్నారు. ఒక ఇరవై సంవత్సరాల క్రిందట ఆయనే గనుక ఈ ప్రశ్న వేసుకొని, సమాధానం కోసం వెతుక్కొని, సరియైన, సంతృప్తికరమైన సమాధానం ఏదీ లభింపక పడివున్నట్లయితే ఆయన జీవితం మరోలా ఉండేదేమో! కనీసం ఇప్పుడింత అసంతృప్తి కలిగేది కాదు.

మరో పదేళ్లలో ఆయనకు అరవై దాటుతాయి.

అప్పటిదాకా ఆయన అటువంటి ప్రశ్న వేసుకోలేదు.

"ఏమి సాధించాను- నేను ఏమి సాధించాను?" ఆయన మళ్ళీ తన్నుతాను ప్రశ్నించుకొన్నారు.

'నిజమే- ఏమి సాధించాను ఈ జీవితంలో? నాకు తెలియని ఎన్నో కొన్ని పూర్వజన్మల పుణ్యఫలితంగా నాకీ ఉత్తమమైన మానవజన్మ కలిగింది గదా అని పెద్దలు అంటున్నది. నాకు పూర్వజన్మ సిద్ధాంతంపై నమ్మకం కలగలేదు ఇంతవరకు. కనుక ఆ విషయం వదిలేస్తాను. ప్రాణికోటిలో మానవుడే కదా సత్యుత్తమ జీవి. ఈ ప్రాణికి ఒక్కదానికే కదా ఆలోచనా శక్తి అంటూ ఉన్నది. తన్నుతాను ప్రశ్నించుకొనే అవకాశం మనిషికి తప్ప మరే ఇతర ప్రాణికి లేదు కదా! ఇది ఎంత మంచి ప్రశ్న! ఎంత సబబైన ప్రశ్న! ఎందుకు నే నిన్నాళ్లూ ఈ ప్రశ్న వేసుకోలేదు?'

రామయ్యచౌదరిగారు ఒక్క క్షణం ఆశ్చర్యపడ్డాడు. ఆయన అంతలో విచారపడ్డారు కూడానూ. ఆ ప్రశ్న మళ్ళీ మెలికలు తిరిగి, తళుక్కుమని మెరుపులా ప్రత్యక్షమైంది. చనరాకోలుతో అలా ఒకసారి విదిలించి చళుక్కుమనిపించినప్పుడు కొన తగిలి చురుక్కుమనిపించినంత బాధ కలిగించింది ఆ ప్రశ్న. అది ఆయన హృదయాన్ని తాకి స్పందింప చేసింది.

ఆయన వెనక్కు తిరిగి చూచుకొన్నాడు సాఫీగా. దాదాపు అప్రయత్నంగా నెమ్మదిగా నడిచి వచ్చిన గత జీవిత మార్గం స్ఫురణకు వచ్చింది.

ఎన్నడో ఇరవై అయిదు సంవత్సరాల క్రిందట ఆయనకు అతి వైభవంగా వివాహం అయింది. పది ఎకరాల ఆస్తితో పెట్టెడు నగలతో భార్య కాపరానికి వచ్చింది. ఆమె పేరుకు మాత్రమే భాగ్యలక్ష్మి కాదు; అక్షరాలా భాగ్యలక్ష్మి ఆవిడ. కోడలు వచ్చినవేళ మంచిది. మనకు అన్నీ కలిసి వచ్చాయి అని మొన్న మొన్నటిదాకా రామయ్యగారి తండ్రి అంటూ ఉండేవారు. ఇంటి పెత్తనం అంతా క్రమంగా కోడలికి అప్పగించారాయన. ఆవిడ ప్రయోజకురాలే అనిపించుకొన్నది. ఇద్దరు ఆడపిల్లలూ, ఇద్దరు మొగపిల్లలూ కలిగారు. ఆడపిల్లలకు తన పేరిట ఉన్న పొలం అమ్మించి తనకు దగ్గర బంధువుల ఇళ్ళలోనే ఇచ్చి పెళ్ళిళ్ళు చేసింది ఆవిడ. మొగపిల్లల చదువు సంధ్యల వ్యవహారమంతా ఆవిడే స్వయంగా చూచుకొంటూ వచ్చింది.

రామయ్యగారి ఆస్తి చెక్కుచెదర లేదు. ఎన్నడూ స్వంత వ్యవసాయం కాకపోయినా, పెద్ద చదువులు చదివి ఉద్యోగాలు చేసి అదనంగా సంపాదించకపోయినా, చీట్ల పేకలో ప్రతి సంవత్సరం మొత్తంమీద కొంత కొంతగా సొమ్ము పోతూవచ్చినా, మొగపిల్లలను

బస్తీలలో ఉంచి చదివించినా ఆయన ఇరవై ఎకరాల మాగాణి తరగలేదు. పైగా అందరికంటే ఎక్కువ దర్జాగా గడిచింది ఆయన జీవితం. బాగా డెబ్బై ఏళ్ళు వచ్చేదాకా ఆయన తండ్రి పైఎత్తున ఉండి వ్యవహారాలు నడిపారు. ఆయన పొయ్యాక కూడా రామయ్యగారికి ఎక్కడా ఏ కష్టమూ కలుగలేదు.

గడచిన అనేక విషయాలు జ్ఞాపకం వచ్చాయి ఆయనకు. అయితే ఇందులో నేను సాధించిందేమిటి ?... అవును నేను ప్రత్యేకంగా ఏమిటి సాధించాను ? నా స్వంత ప్రయోజకత్వం అంటూ ఎక్కడ కన్పించింది ?

అదే ప్రశ్న. అదే మాట.

క్షణానికో రకంగా ఆద్యంతాలు మార్చుకొని, స్వల్పమైన రూపభేదాలతో మళ్లీ మళ్లీ ఎదురైంది. ఎన్ని విధాల ప్రయత్నించినా సమాధానం లభించలేదాయనకు. నాగుపాము పగబట్టి బుసకొడుతూ తన్ను నిలవేసినట్లే అనిపించింది. తప్పించుకొని పారిపోవడానికి వీల్లేదు. కదలడానికి వీల్లేదు. మెదలడానికి వీల్లేదు. కదలినా మెదలినా కాటేస్తుంది. అలా అనిపించింది అప్పటి పరిస్థితి.

'అబ్- ఏమీ సాధించకపోవడం ఏమిటి ఇదంతా...' అని అహం అడ్డువచ్చి ఏదో సమాధానం చెప్పబోయింది. కాని నిజాయితీ దాన్ని ఎదుర్కొని 'ఏదంతా ? ఏదంతా నువ్వు సాధించింది ? వివాహం చేసుకోవడం, సంతానం కలగడం, వాళ్లకు పెళ్లిళ్ల కావడం, వాళ్ల కుటుంబాలు పెరగడం, పొలాలు కవులుకు ఇవ్వడం, వాళ్ళు పండిన దాంట్లో ఎంతో కొంత గుమ్మం ముందుకు వచ్చి ఇచ్చిపోవడం, చీట్లపేక ఆడడం, తరుచు డబ్బు పోగొట్టుకోవడం ... ఇవన్నీ కూడా ఎంత సామాన్యమైన విషయాలు ! ఇతరులకంటే అధికాధికంగా, ప్రత్యేకంగా

ఆశించి, ఆశయ సాధనకై నిర్విరామంగా కృషిచేసి నువ్వు సాధించింది ఏమిటో వేలుమడిచి చెప్పచూద్దాం'- అని ఎదురుప్రశ్న వేసింది. దాంతో అహం చప్పబడ్డది.

ఆయన అసహాయస్థితిలో పడ్డారు. ఆయన విసుక్కొన్నారు. కోపగించుకొన్నారు. కసురుకొన్నారు. ధీమా ప్రదర్శింపబోయారు. ముందుకు నడువబోయారు. వెనుతిరగ పోబోయారు. సమాధానం చెప్పి మరీ కదలవయ్యా అని ఎవరో తన్ను అదలించినట్లు అనిపించింది. ఆయన ముందుకు అడుగు వెయ్యలేకపోయారు. వెనుతిరగలేక పోయారు. గతం అంతా వ్యర్థం అయినట్లు అనిపించింది. భవిష్యత్తు నిరాశాజనకంగా తోచింది. అప్పుడాయన జాగ్రత్తగా ఆలోచించడం మొదలుపెట్టారు క్రమంగా ఆయన ఆలోచన తీవ్రమైనదీ, ప్రగాఢమైనదీ అయింది. ఎంతకూ ఆ ఆలోచన తెగలేదు.

అది అంత తేలికగా తెగదు కూడాను.

ఆ ప్రశ్న స్వభావం అటువంటిది. అది మనిషిని- బుద్ధిమంతుణ్ణి తీవ్రంగా ఆలోచింప చేస్తుంది. పూర్వాపరాల పర్యావలోకనం చేసేలా చేస్తుంది తరచు అలా ప్రశ్నించుకొంటూ నడిస్తే జీవితానికి- జీవితం గడపడానికి ఒక నిర్దిష్టమైన ప్రయోజనం, ఒక సుస్పష్టమైన ఆదర్శం, నిర్ణీతమైన ఒక లక్ష్యం ఏర్పడుతాయి. ఏరోజు కారోజు, ఏవారాని కావారం, ఏయేటి కాయేడు ఏమి సాధించాను అని ప్రశ్న వేసుకొంటూ, సమగ్ర పరిశీలన జరుపుకొంటూ నడిస్తే మనిషి పురోగామి అవుతాడు. వైయక్తికంగానే కాక సామూహికంగా మనం ఏమి సాధించాం అని ప్రశ్నించుకొన్నప్పుడు ఒక సంఘం, జాతి, దేశం ఏమిటి సాధించిందో తేలుతుంది కనీసం తేల్చుకోడానికి ప్రయత్నం జరుగుతుంది. ఎప్పటి కప్పుడు అలా ప్రశ్నించుకొంటూ సాధించనిదాన్ని సాధించే ప్రయత్నం

చేస్తూ, నవజీవన చైతన్యంతో, అత్యుదాత్తమైన ఆశయాలతో ముందుకు సాగిపోయే సంఘం - జాతి - దేశం - ప్రపంచం గర్వపడవలసిన ఘనవిజయాలను సాధిస్తుంది. అటువంటి దేశం అనేక ఇతర దేశాలకు మార్గదర్శకం అవుతుంది. ప్రతి జాతీ కూడా ఇటువంటి ప్రయత్నం కొనసాగించినప్పుడు ఆర్థికంగా, రాజకీయంగా, నైతికంగా 'ఇది-ఇది' సాధించామని చెప్పుకోగలుగుతుంది.

అసలా ప్రశ్నే లేకపోతే !

ఏదో ఒకనాడు నీవు అసంతృప్తికి గురికావలసి వస్తుంది. జీవితం వ్యర్థమనిపిస్తుంది. గడచిన, గడవబోతున్న జీవితం చప్పగా కన్పిస్తుంది. ప్రతివాడు ఫలానా విషయం అది స్వల్పమైనదే- కొందరి దృష్టిలో అల్పమైనదే కావచ్చు- అయినా ఇదిగో ఇది సాధించానని చెప్పుకో గలగాలి. ఇదిగో కష్టపడి ఇంత చదువుకొన్నాను. ఈ ఉద్యోగం సంపాదించాను. సొంతంగా, న్యాయంగా, ఆర్జించి ఈ ఇల్లు కట్టాను. ఈ పొలం కొన్నాను. అందరికంటె ఎక్కువగా అధికోత్పత్తి సాధించాను. ఇదిగో ఈ రంగంలో కీర్తి ప్రతిష్ఠలు సంపాదించాను- అని ఆత్మసాక్షిగా అనుకొన్నప్పుడు ఆ మనిషికి ఆత్మగౌరవం కలుగుతుంది; అంతేకాదు ఆత్మ ప్రత్యయం కలుగుతుంది. ఆత్మ ప్రత్యయం మనిషికి ఎంతో అవసరం. నేనిది సాధించాను- అది కూడా ప్రయత్నించి నేను సాధించగలను- అన్న విశ్వాసం కలిగితే ఇంక ఆ మనిషికి కావలసిం దేమిటి ? ఇంక అతను చెయ్యలేనిది అంటూ ఏమి ఉంటుంది? ఊసర క్షేత్రాలను సస్యశ్యామలంగా మార్చగలడు. నదీ గమనమార్గం మార్చ గలడు. నదీనదాలలోని నీరు వృధాగా సముద్రంలో కలిసిపోకుండా అరికట్టి పొలాలకు మళ్లించుకోగలడు. ఒకటేమిటి ఏమైనా చెయ్యగలడు. వెళ్లిపోతున్న వసంతాలను వెనక్కు పిలువగలడు. నిత్యవసంతంలో తన జీవితాన్ని నందనవనంగా రూపొందించుకోగలడు.

రామయ్యచౌదరిగారు అలా ఆలోచిస్తూనే ఉన్నారు. ఆయన ఇంకా అక్కడే నిలబడ్డారు.

నిజం నేను ఇటువంటి ఆలోచన లేకుండానే గడిపేశాను. కాలం గడవడం ఓ పెద్ద విషయం కాదు. కాలం దానంతట అదే గడుస్తుంది. అందులో మన ప్రతాపం ఏమీ లేదు. ఆ గడుస్తున్న కాలంలో మనం జీవించి ఉన్నందుకు ప్రత్యేకంగా, విశేషంగా సాధించిందేమిటి అన్నది ప్రశ్న' అనుకొన్నారాయన.

అప్పటికి ఆయనకు ప్రశ్న సుస్పష్టంగా బోధపడ్డది.

వ్యాహ్యాళికని బయలుదేరిన మనిషి నెమ్మదిగా వెనుతిరిగి ఇంటికి వెళ్లారు.

ఆయనలో పెద్ద ఆందోళన బయలుదేరింది.

మనసులో సంఘర్షణ చెలరేగింది.

ఏమీ తోచకుండా పోయింది. ఎక్కడా స్థిమితంగా కూర్చోలేక పోయారు. అన్న పానీయాలు రుచించక పోవడమే కాదు, ఆయనకు సరిగా నిద్రపట్టలేదు. రెండురోజుల తర్వాత హఠాత్తుగా ప్రయాణమై ఆయన దేశంమీదకు వెళ్లారు.

ఆలోచిస్తూ వెళ్లారాయన.

గతం గురించి చింతించి ప్రయోజనం లేదు. ఇకముందు ఏమి సాధించాలి? అని ప్రశ్నించుకొన్నా రాయన. ఆయన అనేక చోట్లకు వెళ్లారు. అలా వెళ్లి పలువురను ఆ విధంగా ప్రశ్నించారు. కొందరు మేం స్వాతంత్ర్యం సాధించామన్నారు. కొందరు మేం ఈ ప్రాజెక్టులు సాధించామన్నారు. ఇలా ఎన్నో చెప్పారు. అవన్నీ ఆయన సావధానంగా వింటూ, కొంత సంతోషిస్తూ, వీటిలో నేను కూడా భాగస్వామిని అయితే ఎంత బాగుండేది అనుకొంటూ యాత్రలు కొనసాగించారు.

ఒకనాడు గుట్టమీద గుడిలో సాయంత్రం పూట ప్రశాంతంగా ఉంటుందని చాలా శ్రమపడి వెళ్లారు రామయ్యగారు.

పగలంతా ఎక్కడెక్కడో తిరిగి తిరిగి పక్షులు గూళ్ళు చేరుకొంటున్నాయి. ప్రపంచానికి అంతటికీ వెలుగు పంచిఇస్తూ, కాంతి ప్రదానం చేస్తూ ఉన్నంతసేపూ మరింత కాంతిమంతంగా ప్రకాశిస్తూ నెమ్మదిగా పశ్చిమానికి చేరుకొంటున్నాడు సూర్యుడు. ఆకాశంలో చలన్మేఘాలు కన్పిందాయి. అవి ఎక్కడ నుంచి వస్తున్నాయో ఎక్కడకు పోతున్నాయో అనుకొంటూ ఆయన ఆ మేఘాలవంకే చూస్తూ నిలబడ్డారు. నాబోటివాళ్ల జీవితాలూ ఇంతే. పరిస్థితులు ఎలా అనుకూలంగా ఉంటే అలా నడుస్తూ ఉంటాయి ఈ జీవితాలు. గాలి ఎటు వీస్తుంటే అటు పరుగెడుతూ ఉంటాయి ఆ మేఘాలు' అనుకొంటూ ఆయన గుడిలోకి వెళ్లారు.

ఆ సమయంలో ఆయనకు ఒక విచిత్రమైన భావం కలిగింది. మనస్సులో ఏదో లీలగా తళుక్కుమన్నట్లు అనిపించింది.

'అవును ఇప్పుడు తెలిసింది నేను సాధించాల్సింది ... అవన్నీ కాదు- ఇదీ- ఇదే నేను సాధించాలి' అని గట్టిగా అనుకొన్నారాయన.

ఆ భావం మనస్సులో స్థిరపడుతుండగా ఆయనలో అంతకు ముందుదాకా లోపల్లోపల పెచ్చరిల్లుతున్న ఆందోళన, అసంతృప్తి, సంఘర్షణ క్రమంగా తగ్గుముఖం పట్టాయి. ఆయనకు తాము సాధింప దలచిన దానికి అనువైన సాధనమార్గం కన్పించింది. ఉపకరణాలు ఊహకు అందాయి కూడానూ.

ఆయన సంతోషంగా తిరిగి ఇంటికి వెళ్లారు.

పలువురు పండితులతో సంప్రదించారు. శాస్త్ర వేత్తలను సందర్శించారు. ఎన్నో బోధలు విన్నారు. చివరకు ఒక దృఢమైన నిర్ణయానికి వచ్చారాయన.

ఆయనకు భక్తిభావం కలిగింది. భక్తిమార్గం అన్నిటికంటె సులభతరమైనదిగా, ఉత్తమమైనదిగా కన్పించింది.

అందులో ఆయనకు అంతఃకరణ శుద్ధి ఏర్పడింది.

ఆయన సాధకులు అయ్యారు.

నలుగురూ తన్ను అనుకరించేటంత, అనుసరించేటంత నిజాయితీ, నిశ్చలత కనపరచారాయన తమ సాధనలో.

---